# వసతి గృహాల్లో సమస్యలు తిష్ఠ

- చాలీచాలని మరుగు దొడ్లు
- మంచాలు, గదుల కొరత



పెచ్చులూడుతున్న వసతి గృహం పై కప్పు

లింగాల: నియోజకవర్గంలోని పలు సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న వసతి గృహానికి పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ వసతి గృహానికి పక్కా భవనం ఉండగా బాలిక ఆశ్రమ పాఠశాల కోసం ఆ భవనాన్ని నేలమట్టం చేశారు. ప్రస్తుతం ఆ ప్రదేశంలో గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాన్ని రూ.కోటి వ్యయంతో నిర్మించారు. కాని ఎస్సీ బాలుర వసతి గృహన్ని శిథిలావస్థకు చేరడంతో పాత పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిర్వహణ సరిగ్గా లేక విద్యార్థుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారు. వర్షాకాలంలో గదులన్నీ వర్షపు నీటితో నిండుతాయి. గదుల పై కప్పుల పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా మారాయి.

**నియోజక వర్గంలో 29 వసతి గృహాలు**

అచ్చంపేట నియోజక వర్గంలో మొత్తం 29 వసతి గృహాలు ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు ఏర్పాటు చేశారు. వీటిలో 06 బాలుర వసతి గృహాలు, 03 బాలికల వసతి గృహాలు, 15 ఆశ్రమ పాఠశాలలు, మరో 05 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా ఆయా వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో దాదాపుగా 5,200పైగా విద్యార్థులు ఉన్నారు. లింగాల, కొల్లాపూర్‌లో అద్దె భవనాలలో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు చదువులు నెట్టుకొస్తున్నారు.

**గదుల కొరత**

లింగాలలోని ఎస్సీ బాలుర వసతి గృహానికి మంచాలు, పరుపులు సరఫరా చేశారు. కాని ఇరుకైన గదులు ఉండటంతో ఎక్కడ ఉంచాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. గదుల కొరత కారణంగా వసతి గృహం సమీపంలో మరో అద్దె భవనం కూడా తీసుకున్నారు. అది కూడా ఇరుకైన గదులతో ఉండని విద్యార్థులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి అన్ని హంగులతో స్వంత భవనం నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతి గృహం

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**



నియోజక వర్గంలోని పలు వసతి గృహాల్లో అరకొర వసతులు ఉన్నది వాస్తవమే. లింగాలలోని వసతి గృహానికి గతంలో నిధులు మంజూరు కాగా స్థల సేకరణ చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. సమస్యలు వసతి గృహాల వివరాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. –డి. తిరుపతయ్య, ఏసీఎంఓ

## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ అందజేత



కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి చెందిన రేష్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.1.10 లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం సింగిల్‌విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, మాజీ సర్పంచ్ అంజనేయులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో లింగస్వామి, రామస్వామి, కుమ్మరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులంతా మైసమ్మ దేవతను దర్శించుకొని పంటలు బాగా పండాలని మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. మైసమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: పట్టణంలో మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్న వెంకటయ్య రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటయ్యకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్, శ్రీధర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా వాహనాల తనిఖీలు



లింగాల: మండలంలోని మగ్గనూరు ఫూర్ చౌరస్తాలో ఆదివారం ఏఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో వారాంతపు సంత కావడం, నాయినోనిపల్లి మైసమ్మ దర్శనానికి వెళ్లే భక్తుల వాహనాలు అధికంగా రాకపోకలు చేస్తుండడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఎవరైనా రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రారంభానికి నోచుకోని బస్ షెల్టర్



తాడూరు: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించి మూడేళ్లు కావొస్తున్న ప్రారంభానికి నోచుకోవడం లేదు. వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సి పరిస్థితి ఎదురైంది. ప్రారంభించకపోవడంతో శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. బస్‌షెల్టర్‌ను అనుకొని నిర్మించిన మూత్రశాలలు వృథాగా దర్శనమిస్తున్నాయి. నిర్మించిన బస్సుషెల్టర్‌ను ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్‌షెల్టర్‌ను వెంటనే నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట రైతు భరోసా మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతుల అభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకంలో భాగంగా ఎటువంటి షరతులు లేకుండా రూ. 2లక్షల రైతు రుణమాఫీ మార్గదర్శకాలు ఉంటాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ అందిస్తామన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, సీతాడి ఎల్లయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మంత్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, కౌన్సిలర్ గౌరీశంకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# భోజనశాల నూతన భవనం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో దివంగత డీసీసీ మురళి స్మారకార్థం నిర్మాణం చేసిన ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన భోజనశాల నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్సీ మల్లన్నతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అరకొరలను తీన్మార్ మల్లన్న వెలకితీస్తే కేసులు పెట్టి వేధించిందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే నియంతపాలన వస్తుందని భావించి ప్రజలు ప్రజా పాలనకు మద్దతు తెలిపారన్నారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గం ం దశా, దిశ మార్చే శక్తి మంత్రి జూపల్లికే ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మధ్దిలేటి, సీఐ జగదీష్‌లో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ మల్లన్న

# పొలం పనుల్లో రైతన్న బిజీబిజీ

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి, ఊరుకొండ, వంగూరు, వెల్దండ తదితర మండలాల్లో ఆదివారం ముసురు వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు పొలంబాట పట్టారు. కొంతమంది రైతులు పొలాలను దున్నగా మహిళా రైతులు పత్తివిత్తనాలు నాటే పనిలో నిమగ్నమయ్యారు. వారంరోజులుగా కురిసిన వర్షాలకు ఆలస్యంగా వేసిన పంటలకు జీవం పోసినట్లైంది. ఇప్పటి వరకు పడాల్సిన వర్షం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పత్తివిత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

### భక్తితోనే క్రమశిక్షణ



మన్ననూర్: భక్తితోనే క్రమశిక్షణ అలవడుతుందని గురుస్వామి అంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మహోన్నత మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పులిజాల శేఖర్ సరస్వతి దంపతులతో పాటు అంజనేయులను సన్మానించారు. భక్తులు, స్వయం సేవక్ సంఘ్ సభ్యులు వెంకటరమణ, సంబు శ్రీను, రమణ, సరస్వతి, జయమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

### మాజీ మంత్రి పరామర్శ

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కూన సైబ్రలాల్ మాతృమూర్తి కిష్టమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు పత్తి రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్, ప్రవీణ్, శ్రీను, గణేష్, నిరంజన్, తదితరులు ఉన్నారు.

### ఆటో ఢీకొని .. ఒకరికి తీవ్రగాయాలు

తెలకపల్లి: ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలానికి చెందిన సురేష్ సైకిల్‌పై వెళ్తుండగా నెల్లూరు చౌరస్తాలో సైకిల్‌ను ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### ఆర్టీసీ ఉద్యోగులు పదవీ విరమణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించిన ఏడు మంది ఆర్టీసీ ఉద్యోగులు ఆదివారం పదవీ విరమణ పొందారు. పట్టణంలో ఏర్పాటు సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదన్నారు. సేవలో సంతృప్తి కలుగుతుందన్నారు. అనంతరం రిటైర్డ్ అయిన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీ దుర్గాప్రసాద్, పీటీ కుమార్, మోహన్‌లాల్, ఏజేరెడ్డి, ఏకేగౌడ్, నాగయ్యగౌడ్, హుస్సేన్, బీఆర్ఎస్ రెడ్డి, శరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బీటీరోడ్డు కోసం నిరసన దీక్ష



రేమద్దులలో దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల–ఏదుట్ల–సింగాయిపల్లి మధ్య గుంతలమయంగా ఉన్న రోడ్డును బీటీగా మార్చాలని కోరుతూ బీజేపీఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి మాట్లాడారు. వివిధ గ్రామాలతో కలుపుతూ నాలుగు మైళ్లుగల రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా ఉన్నాయన్నారు. వెంటనే స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్షను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, సురేందర్‌రెడ్డి, రవీందర్, చక్రవర్తి, చల్లారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గువ్వల జన్మదినం



అచ్చంపేట రూరల్: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహాగౌడ్, అమినోద్దీన్, అన్సార్, వంశీనాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ముళ్లపొదలు తొలగించండి

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి –కేతేపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో బొబ్బిలిచెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. చెరువు కట్ట రోడ్డు ఇరుకుగా ఉండటం మరోవైపు ఏపుగా పెరిగిన కంపచెట్లు ఉండటంతో ప్రమాదాలు బారిన పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇదే రోడ్డుపై గతంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృత్యువాత పడటం, ఇటీవలనే ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాటి రోజుల్లో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. రిటైర్డ్ హెచ్ఎం మనోహర్ రావు, మల్లయ్య, శ్రీనివాసులు, వెన్నతేశ్వర్లు, చంద్రారెడ్డి, బలరాములు, రాజబాబు తదితరులు ఉన్నారు.

# పంట కాల్వలకు మహర్దశ

కొల్లాపూర్‌రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో నిర్మించిన మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న పంట కాల్వలకు త్వరలో మహర్దశ రానుంది. ఇటీవల కాలువలను శుభ్రం చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మహర్దశ రానుండటంతో ఆయకట్టు రైతులు సంబరా పడుతున్నారు. 12 సంవత్సరాల కిందట కేఎల్ఐ ప్రాజెక్టును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. కొల్లాపూర్ మండలంలోని గ్రామాల్లో రైతుల భూములకు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించేందుకు ఐదు పంట కాల్వలను నిర్మాణం చేశారు. అప్పటినుంచి నుంచి ఇప్పటివరకు పంట కాల్వలలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, జమ్ము తొలగించాలని రైతులు ఎన్నో సార్లు కేఎల్ఐ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. పంటలను కాపాడుకునేందుకు రైతులే సొంత ఖర్చులతో శుభ్రం చేస్తున్నారు. ఈ నెల 28న మంత్రి జూపల్లి కృష్ణారావు కేఎల్ఐ ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించారు. అక్కడ రైతులు మంత్రి దృష్టికి పంట కాల్వల శుభ్రత గురించి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన మంత్రి త్వరలోనే పంట కాల్వలను శుభ్రపరచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నో ఏండ్లుగా పంట కాల్వలకు సాగునీరు సరఫరా సక్రమంగా రాక ఇబ్బందులు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేఎల్ఐ పంట కాల్వలను కింద మండలంలోని రైతుల పొలాలకు దాదాపుగా అనధికారంగా 50 వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. పంట కాలువలను శుభ్రం చేస్తే ఇంకా సాగు పెరిగే అవకాశం ఉంది. కాల్వలను త్వరగా కృష్ణానదికి నీరు వచ్చే లోపే పంట కాల్వలు శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.



కుడికిల్ల సమీపంలో ఉన్న కేఎల్ఐ పంట కాల్వలో పెరిగిన జమ్ము

**సాగునీరుకు ఇబ్బంది ఉండదు**



ప్రతి సంవత్సరం సొంత ఖర్చులతో కాలువలను శుభ్రం చేస్తున్నాం. ప్రస్తుతం మంత్రి జూపల్లి కృష్ణారావు పంట కాల్వలను శుభ్రం చేస్తామని చెప్పడం శుభపరిణామం. కాల్వలలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తే సాగునీరు పుష్కలంగా అందుతోంది. సాగునీరుకు ఇబ్బంది ఉండదు. – కుమ్మరి కురుమయ్య, రైతు, కుడికిల్ల

### ఎమ్మెల్యేకు వినతి

చారకొండ: మండలంలోని గోకారం పెద్ద చెరువు పూర్తిగా ధ్వంసమైందని దీంతో రైతుల పొలాలకు సాగునీరు అందకుండా పోతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి దిల్లేర్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చెరువుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ ఆదివారం ఆయన ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. చెరువు దెబ్బతినడంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా కావడం లేదని విన్నవించారు. 300 మంది మత్స్యకారులకు ఉపాధి కోల్పోయారని వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ గోకారం చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్ గౌడ్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మద్ది నారాయణ రెడ్డిశ్రీను, ముత్యాలు, బాలయ్య తదితరులు ఉన్నారు.

### అసంపూర్తిగా వైకుంఠధామం



తాడూరు: మండలంలోని తుమ్మలసూర్, ఇంద్రకల్, యత్మాతాపూర్, బలాన్‌పల్లి, పర్వతాయిపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో శ్మశానవాటిక నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే వైకుంఠధామాల పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### సెల్‌ఫోన్లు అప్పగింత



కల్వకుర్తి టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు ఆదివారం ఎస్ఐ మాధవరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీఈఐఆర్ ద్వారా ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. సహకరించిన ఏఎస్ఐ హనుమంత్‌రెడ్డి, కానిస్టేబుల్స్ నజీర్, శ్రీను, చిరంజీవిలను ఎస్ఐ అభినందించారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు సింగిల్ విండో మహాజన సభ

లింగాల: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో సోమవారం ఆత్యవసర సర్వసభ్య సమావేశం(మహాజన సభ)ను నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీఈఓ పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని తెలిపారు. సంఘం సభ్యులు, రైతులు హాజరుకావాలని కోరారు.

# రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

వెల్దండ: రైతులకు ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకాన్ని రైతుల అభిప్రాయ ప్రకారమే అందిస్తుందని సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సహకారశాఖ ప్రత్యేక అధికారి రఘునందనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇచ్చిన అభిప్రాయ సూచనల మేరకు ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు అందిస్తుందన్నారు. రెండు పంటలకు ఎకరానికి రూ.15వేలు అందించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌ముదిరాజ్, నరేష్, మట్ట వెంకటయ్య గౌడ్, జంగయ్యయాదవ్, రాఘవేందర్ రెడ్డి, నిరంజన్, గండయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, ఏఈఓలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు